క్లుప్తంగా

కొనసాగుతున్న విరాళాల సేకరణ



పాన్‌గల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీరామాంజనేయ ఆలయ పునర్ నిర్మాణంలో భాగంగా మండలకేంద్రంలలో గడప గడపకు తిరుగుతూ విరాళాలు సేకరణ కార్యక్రమం కొనసాగుతుంది. ఆదివారం మండలకేంద్రంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామంలో గడప, గడపకు తిరుగుతూ విరాళాలు సేకరించారు. గ్రామస్తులు ప్రతి ఒక్కరు భాగస్వాములవుతూ నిర్మాణానికి తమ వంతు ఆర్థికసాయాన్ని అందించాలని గ్రామస్తులకు కమిటీ సభ్యులు సూచించారు. కార్యక్రమంలో కృష్ణయ్యయాదవ్, శివయాదవ్, వెంకటయ్య, బాలపీరు, బాలరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాలపై అవగాహన



వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రబోధా సేవాసమితి సభ్యులు భగవద్గీతలో ఉండే జ్ఞానంపై గ్రామంలోని ప్రజలకు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. గ్రామంలోని కొంతమందికి భగవద్గీత, ఆధ్యాత్మిత గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తకోట కమిటీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, పురుషోత్తం, నరేందర్, తోకేష్, మాసన్న, రామచంద్రయ్య, గణేష్, బాలకృష్ణ, శైలజ, జ్యోతి, మంజుల, ఈశ్వరి, హేమలత, కృష్ణ, కాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం ఎన్నిక



గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని తల్పునూరు గ్రామంలో ఆదివారం నూతన అంబేడ్కర్ యువజన సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గురగాల కుర్మయ్య, ఉపాధ్యక్షుడిగా బోడశ్రీను, ప్రధానకార్యదర్శిగా బూడిద దేవేందర్, కోశాధికారిగా కేతెపల్లిరాజు, సలహాదారులుగా చిన్నరాములు, కుంటిమధు, ప్రధాన కార్యదర్శులుగా వేణు, కల్మూరికిరణ్, రాజేందర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. అంబేద్కర్ ఆశయ సాధనకోసం పనిచేస్తుందని భవిష్యత్తులో ఎవరు ఇబ్బందులకు గురైనా వారి పక్షాన ఉండి పోరాడుతుందని పేర్కొన్నారు.

హైస్కూల్‌లో టపాసుల స్టాల్స్..



అమరచింత: దీపావళి సందర్భంగా పురస్కరించుకుని టపాసులను విక్రయించేందుకు స్టాళ్లను పట్టణంలోని హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేశారు. విక్రయాల సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలతో స్టాళ్లను ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ స్వాతి సూచించారు. వీటికి సంబంధించిన వ్యాపార లైసెన్స్‌లను అగ్నిమాపక అధికారులు పరిశీలించి షాపులు ఏర్పాటుకు అనుమతి ఇచ్చారన్నారు. మూడురోజుల పాటు మైదానంలో టపాసులను అమ్మకానికి ఉంచుతున్నట్లు వ్యాపారులు తెలిపారు.

రోడ్డు పమ్రాదంలో వ్యక్తి మృతి

మదనాపురం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో సెల్‌షాప్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న బాబా(30) భోజనం కోసం తన స్వగ్రామమైన కొత్తకోటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా స్టేజీవద్ద కుక్కను తప్పించ బోయి బైక్‌పై నుంచి జారిపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి తీవ్ర రక్తప్రసరణతో మృతి చెందాడు. ఎల్లప్పుడూ చుట్టుపక్కలవారితో ఆప్యాయంగా మెలిగే యువకుడు ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆందోళనలో అన్నదాతలు

- తెగిన కమాలోద్దీన్‌పూర్ బ్రాంచ్‌కెనాల్
- పొలాల్లో పారుతున్న అప్పారెడ్డి కాల్వనీళ్లు
- పాడవుతున్న పంటలు.. పట్టించుకోని అధికారులు



అల్లమాయపల్లి గ్రామ శివారులో తెగిన కమాలోద్దీన్‌పూర్ బ్రాంచ్‌కెనాల్ కాల్వ

ఖిల్లాఘనపురం: సాగునీరు పుష్కలంగా ఉండటంతో ఎంతో ఆశతో సాగు చేసుకున్న వరి పంటలు సాగునీటి కాల్వలు తెగి పాడైపోతుండటంతో అన్నదాతలు ఆగమైపోతున్నారు. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో ఏం చేయాలో తెలియక మండలంలోని అల్లమాయపల్లి గ్రామానికి చెందిన అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్ (కేఎల్‌ఐ) నుంచి బిజినేపల్లి మండలం మంగనూరు శివారు నుంచి ఖిల్లాఘనపురం, కమాలోద్దీన్‌పూర్ బ్రాంచ్ కెనాల్ ద్వారా సాగునీరు అందిస్తున్నారు. సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి, అల్లమాయపల్లి తదితర గ్రామాల శివారు కమాలోద్దీన్‌పూర్ బ్రాంచ్‌కెనాల్ తవ్వారు.

తెగిన కాల్వ..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అల్లమాయపల్లి శివారులో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర కమాలోద్దీన్‌పూర్ బ్రాంచ్‌కెనాల్ తెగిపోయింది. కాల్వ ద్వారా వచ్చే కేఎల్‌ఐ నీటితో పాటుగా వర్షాలు కురిసినప్పుడు వచ్చే నీళ్లు కూడా పెద్ద ఎత్తున రావడంతో కాల్వతెగిన దగ్గర వ్యవసాయ పొలాల్లోకి పారుతున్నాయి. దీంతో వరి పంటల నుంచి పారడంతో ఇసుక మేటలతో పాడైపోయాయి. ప్రస్తుతం సాగునీటిని నిలిపివేయడంతో నీళ్ళు తగ్గిపోయాయి.

అప్పారెడ్డిపల్లి గ్రామ శివారులో..

కమాలోద్దీన్‌పూర్ బ్రాంచ్‌కెనాల్ నుంచి వెల్కిచెర్ల రోడ్డు దగ్గర నుంచి అప్పారెడ్డిపల్లి సాగునీటి కాల్వను అధికారుల ఏర్పాటు చేశారు. కాల్వకు బుడ్డ ఏనె



అప్పారెడ్డిపల్లి శివారులో పూర్తిగా ఇసుకతో పూడిన కాల్వ పై నిర్మించిన పైపు కల్వేట్

(చిన్నపాటిగుట్ట) దగ్గర ఏర్పాటు చేసిన పైపు కల్వేట్ భూమిలోకి వేయడంతో ఇసుకతో పూడకపోయింది. పైపు ఇసుకతో నిండడంతో నీళ్లు వెళ్లడానికి అవకాశం లేకుండా పోయింది. నీళ్లు వెళ్లడానికి వీలు లేకుండా పోవడంతో కాల్వ తెగి పైన పొలాలనుంచి నీరు పారుతున్నాయి. ఇలా పారడంతో పక్కనేఉన్న పత్తి, వరిపంటలు పాడైపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మరమ్మతు చేయిస్తాం

అల్లమాయపల్లి, అప్పారెడ్డిపల్లి గ్రామ శివారులో కాల్వలు తెగిపోవడంతో పాటు పంట పొలాల్లోకి నీళ్ళు పారుతున్నట్లు సమాచారం వచ్చింది. పై అధికారులతో మాట్లాడి త్వరలోనే మరమ్మతు మనులు చేయిస్తాం.

- లక్ష్మీకాంత్, ఏఈ

అధికారులు పట్టించుకోవడం లేదు



అల్లమాయపల్లి కరెంటు సబ్‌స్టేషన్ దగ్గర కాల్వ తెగిపోయిందని ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు చెప్పాం. వస్తాం, చూస్తాం అంటున్నారు, ఇప్పటివరకు ఎవ్వరు వస్తలేరు. కాల్వద్వారా వచ్చేనీటిని నిలిపివేశారు. ఇప్పుడు మరమ్మతులు చేసే అవకాశం ఉంది.

-మొల్గర శేషయ్య, అల్లమాయపల్లి

వరిపంట కొట్టుకుపోయింది..



మా ఊర్లో నెలరోజుల కిందట పెద్ద వాన రావడంతో పైన కాల్వ తెగిపోవడంతో నీళ్లు ఎక్కువ రావడంతో వరిపంట కొట్టుకపోయింది. అరఎకరం పంట పూర్తిగా నీటిలో మునిగింది. ఇసుక మేటలు వేశాయి. పొలాన్ని నేను కౌలుకు తీసుకుని సాగుచేశాను. అధికారులు ఇప్పటికి కాల్వకు మరమ్మతులు చేయలేదు.

-భగవంతు, అల్లమాయపల్లి

పైపులు భూమిలోకి వేసింద్రు..



బుడ్డఏనె (చిన్నగట్టు) దగ్గర పైపులు వేసేటప్పుడు సక్కగా చూసుకున్నారో లేదో.. నీళ్లు వచ్చినప్పుడు మట్టికొట్టుకవచ్చి పైపులు నిండుతున్నాయి. సారువాళ్లకు చెబితే చూసి వెళ్లారు. సొంతఖర్చులతో రెండుసార్లు మట్టి తీయించాం. నీరువచ్చినప్పుడు పొలాల్లోకి పారుతుండడంతో పత్తిచేను పాడైపోయింది.

- చెన్నయ్య, అప్పారెడ్డిపల్లి

కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకం



కిక్‌బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం అందుకున్న విద్యార్థి

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన సింగరపు ఝాన్సి కిక్‌బాక్సింగ్‌లో బంగారు పథకం సాధించిందని చిట్యాల గోజూరియో కరాటే అండ్ కిక్ బాక్సింగ్ అకాడమి మాస్టర్ వరుణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం మహ బూనగర్‌లోని ఇండోర్ సేడియంలో నిర్వహించిన ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ లీగ్‌లో అండర్ 13,14,15 పోటీల్లో హార్ట్ స్టైల్ వెపన్ విభాగంలో సింగరపు ఝాన్సి పాల్గొని బంగారు పతకం సాధించిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బంగారు పథకం సాధించిన విద్యార్థిని తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు కరాటే శేఖర్ మాస్టర్ అభినందించారు.

యువకులు క్రీడల్లో రాణించాలి

వీపనగండ్ల: యువకులు క్రీడల్లో రాణించనప్పుడే గ్రామానికి పేరు ప్రతిష్టలు వస్తాయని వివిధ పార్టీల నాయకులు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో వీపీఎల్ - పై క్రికెట్ పోటీలను వివిధ పార్టీల నాయకులు మండలకేంద్రంలో ప్రారంభించారు. క్రీడాస్ఫూర్తితో వ్యవహరించి గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. తూముకుంట గ్రామంలో ఉమ్మడి మండలస్థాయి వాలీబాల్ పోటీలను స్థానిక ఎస్‌ఐ రాణి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీరయ్యయాదవ్, మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు ముంత మల్లయ్యయాదవ్, కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, గోపి, యాదయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వం



బీఆర్‌ఎస్‌లో చేరిన వారినుద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి విద్యావిభాగం: ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో మూడేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ పార్టీనేని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని 20వ వార్డు లో 50 మంది యువకులు బీఆర్‌ఎస్ యువ నాయకుడు సునీ ల్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. చేరుతున్న వారికి మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల్లో బీఆర్‌ఎస్‌పై అపూర్వస్పందన లభిస్తుందన్నారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్లపాలనలో పట్టణాన్ని ప్రగతిపథంలో నడిపించామని, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రోడ్ల విస్తరణ పూర్తి చేశామన్నారు. నేడు రోడ్లు ఆక్రమించుకుంటున్న పట్టించుకున్న నాథుడు లేకుండా పోయాడని మౌలిక వసతులు మంచినీటి, డ్రైనేజీ, విద్యుత్, అంతర్గత రోడ్లు, పార్కులు, చెరువులు అభివృద్ధి చేశామని వాటిని పరిరక్షించుకోలేని స్థితిలో నేటి పాలకులు ఉన్నారని ఎద్దేవా చేవారు. 3,200 డబుల్ బెడ్రూంలు ఇల్లు నిర్మిస్తే అందులో 1500 పట్టణములో నిర్మించామన్నారు. యువతకు స్వయం ఉపాధి, ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో ఎదిగేందుకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. కార్యక్రమములో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్ పలుస రమేష్‌గౌడ్, అశోక్, నాగన్నయాదవ్, సూర్యవంశం గిరి, హేమంత్, జోహెబ్ హుస్సేన్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడికి నివాళులర్పించిన మాజీ మంత్రి

వనపర్తి రూరల్: మండలంలోని రాజపేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు గొడుగు లక్ష్మయ్య అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక నాయకులతో విషయం తెలుసుకున్న మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆదివారం గ్రామంలో పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుంటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబాన్ని ఆదుకుంటానన్నారు. వారి వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాణిక్యం, సింగిల్ విండో చైర్మన్ రఘువర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మాధవరెడ్డి, అశోక్, నాయకులు, ఇతర కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీల పోరాటం



జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ జేఏసీ నాయకులు

వనపర్తి విద్యావిభాగం: రిజర్వేషన్లు తమ హక్కు అని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్‌గౌడ్ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండుతో జిల్లా కేంద్రంలో బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 200 ద్విచక్ర వాహనాలతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాల నుంచి శంకర్‌గంజ్, పాతబజార్, రాజీవ్‌చౌక్, కొత్త బస్టాండ్ మీదుగా మర్రికుంట వరకు ర్యాలీ సాగింది. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఎనమల కుర్మయ్య యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రాచాల మాట్లాడుతూ.. రాజ్యాంగ సవరణ ద్వారా బీసీల రిజర్వేషన్లకు భద్రత కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం పెంచిన బీసీ రిజర్వేషన్లను యధావిధిగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష బీసీ నాయకులు సతీష్‌యాదవ్, పగిడాల శ్రీనివాస్, చీర్ల చందర్, గట్టు యాదవ్, పలుస రమేష్ గౌడ్, వాకిటి శ్రీధర్, శంకర్‌గౌడ్, దేవర శివ, అర్జున్ యాదవ్, కాగితాల గిరి ఇతర సంఘాల నాయకులు స్వచ్ఛంద సంస్థలు, ఇతర పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బస్సులు లేక.. పరేషాన్

- మరికల్ – ఆత్మకూర్‌కు ఒకే ఒక షటిల్ సర్వీస్
- గంటల తరబడిగా ఎదురుచూపులు
- ప్రైవేట్ వాహనాల దోపిడి



మరికల్ బస్టాండ్‌లో ఆత్మకూర్ బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

అమరచింత: మరికల్–ఆత్మకూర్ పట్టణాలకు ఆర్టీసీ షటిల్ సర్వీస్‌లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితులు దాపురిస్తున్న సంబంధిత ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆత్మకూర్–వనపర్తి పట్టణాలకు ప్రతి అరగంటకు ఒక షటిల్ సర్వీస్ కొనసాగుతుండగా ఆత్మకూర్–మరికల్ పట్టణాలకు మాత్రం ఒకే ఒక ఆర్టీసీ సర్వీస్‌ను కొనసాగిస్తుండటంతో ప్రయాణికులతో పాటు విద్యార్థులు నిత్యం ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితులు ఉన్నాయి. ఆత్మకూర్ నుంచి మరికల్ మీదుగా మహబూబ్ నగర్, నారాయణపేట, హైదరాబాద్ పట్టణాలకు వ్యాపారం నిమిత్తం వెళ్తున్న వారు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో తమ ప్రయాణాలకు ఆత్మకూర్ మీదుగా దేవరకద్ర నుంచి ఆర్టీసీ సర్వీసులను ఆశ్రయించి తమ తమ పనుల నిమిత్తం వెళ్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. ఫ్రీ బస్ అమలైనప్పటి నుంచే మరికల్–ఆత్మకూర్ మీదుగా కొనసాగుతున్న షటిల్ సర్వీస్‌లను కుదించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో 4 షటిల్ సర్వీస్‌లు కొనసాగుతుండగా ప్రస్తుతం 2 సర్వీసులను మాత్రమే కొనసాగిస్తున్నారు. వీటిని సైతం సెలవు రోజుల్లో రెండింటిలో కేవలం ఒకే ఒక సర్వీస్‌ను నడుపుతుండటంతో ప్రయాణికులు గంటల తరబడి బస్ కోసం ఎదురుచూస్తూ తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ టాటా ఏసీ ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

డిపోల మధ్య కుదరని సయోధ్య..

ఆత్మకూర్ నుంచి మరికల్ పట్టణానికి బస్ సర్వీస్‌లను కొనసాగించేందుకు వనపర్తి, గద్వాల, నారాయణ పేట డిపోల మధ్య సమన్వయం లేకపోవడంతో ఎవరికి వారుగా సర్వీస్‌లను రూట్‌లనుంచి తొలగించడంతో సమస్య తీవ్రతరమైంది. అప్పట్లో గద్వాల డిపో నుంచి మూడు సర్వీస్‌లను మరికల్‌కు నడుపుతుండగా వనపర్తి డిపో నుంచి 2 సర్వీస్‌లను నడిపేవారు. ప్రస్తుతం తమ సర్వీస్‌లకు అనుకున్న మేరకు టార్గెట్ రీచ్ కావడం లేదని ఎవరికి వారుగా సర్వీస్‌లను రద్దు చేయడం జరిగింది. మంత్రి వాకిటి శ్రీహరి ఈ ప్రాంత ప్రజల, ప్రయాణికులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సమయానికి అనుగుణంగా ఆర్టీసీ సర్వీస్‌లను కొనసాగించాలని కోరుతున్నారు.

కుక్కల బెడద నివారించరూ

అమరచింత : పట్టణంలోని పలు వార్డుల్లో వీధికుక్కలు రో జు రోజుకు పెట్రేగి పోతున్నా యి. చిన్నారులతో పాటు యువకులపై దాడి చేసి గాయాలబా రికి చేస్తున్న వాటిని పట్టణం నుంచి తరలించ లేక పోతున్నా రని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో బీసీ కాలనీలో ఇంటి ఎదుట ఆడుకుంటున్న చిన్నారిపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయపడిన చిన్నారిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి చేయించారు. గత పక్షం రోజుల కిందట శ్రీకృష్ణానగర్‌లో ఇద్దరు కుక్కకాటుకు గురయ్యారు. మటన్‌మార్కెట్ పరిసరాల్లో శునకాలు అధికంగా ఉండటంతో అటుగా ఒంటరిగా వెళ్లాలంటే భయపడే పరిస్థితులు దాపురించాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించాలని కోరుతున్నారు.



గుంపులుగా ఉన్న వీధి కుక్కలు

నియోజకవర్గంలో బీజేపీని బలపరుద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజు

గోపాల్‌పేట: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోపు నియోజకవర్గంలో బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలంతా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం ఆయన రేవల్లి మండలంలోని పాతతండాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన తండాలో పర్యటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీజేపీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. బీజేపీ కోసం తప్పనిసరిగా అందరూ పనిచేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చూపించాలన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలోపు బీజేపీ పార్టీదే పైచేయి ఉండాలని కార్యకర్తలకు పిలుపుచ్చారు. ఎవరు ఇబ్బందిలో ఉన్నా తనకు ఒక్క ఫోన్‌కాల్ చేస్తే అప్పటికప్పుడు అందుబాటులోకి వచ్చి తనవల్ల అయిన సాయం అందిస్తానని చెప్పారు. అయితే మీటింగ్‌లో పాల్గొన్న కొంతమంది గువ్వల బాల్‌రాజు నాన్న బీజేపీ తరఫున ఎంపీటీసీ, లేదంటే జెడ్పీటీసీ కోసం ఎన్నికల్లో నిలబెట్టాలని కోరగా బీజేపీ యువతకు ప్రాధాన్యత ఇస్తుందని, నాన్న వద్దని యువత ముందుకు వచ్చి ఎన్నికల్లో పోటీచేస్తే తప్పకుండా సహకరిస్తానని ఆయన వివరించారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయా ఇతర పార్టీలకు చెందిన 50 మంది పైగా యువకులను పార్టీ కండువా కప్పి బీజేపీలోకి చేర్చుకున్నారు. కార్యక్రమంలో లోక్‌నాథ్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బంతి సాగు.. లాభాలు బాగు

పాన్‌గల్: బంతిపూల సాగు రైతులకు లాభదాయకం, ఎందుకంటే దీనికి పెట్టుబడి తక్కువ, తక్కువ కాలంలోనే పంట వస్తుంది. ముఖ్యంగా పండుగ సీజన్లలో మంచిధర లభిస్తుంది. బంతిపూల సాగుతో అధిక దిగుబడులు సాధిస్తూ ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నా రైతు అచ్యుతారెడ్డి. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం అన్నారం గ్రామానికి చెందిన రైతు ఒక ఎకరంలో బంతిపూల సాగు చేపట్టి లాభాలు గడిస్తున్నారు. రైతు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలోని నందికొట్కూరులో బంతిపూల సాగుతో లాభాలు పొందుతున్న రైతులను గమనించి తాను కూడా అదే బాటలో లాభాలు పొందాలని నిర్ణయించుకొని శ్రీకారం చుట్టారు. దసరా, దీపావళి, కార్తీకమాసం సీజన్లల్లో దిగుబడి వచ్చే విధంగా గత నాలుగు ఏళ్లుగా ప్రణాళికతో ముందుకెళ్తూ మంచి లాభాలు సాధిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

రూ.1.50 లక్షల వరకు ఆదాయం..

ఎకర పొలంలో సాగు చేసిన బంతిపూల తోట నాల్గు నెలల పంటకాలంలో రెండునెలల పాటు దిగుబడి చేతికందుతుందని రైతు తెలిపారు. సాగు చేసిన పూల తోట నుంచి దాదాపుగా 2 టన్నులకు పైగా దిగుబడి వస్తోందని ఆయన తెలిపారు. పండుగ సీజనల్లో కిలో రూ.100 చొప్పున ధర పలుకుతోందని ఆయన పేర్కొన్నారు.

పూల వలన దాదాపుగా రూ.2లక్షల వరకు వచ్చే ఆదాయంలో రూ.50వేల వరకు ఖర్చులు పోగా రూ.1.50 లక్షల వరకు ఆదాయం లభిస్తుందని రైతు పేర్కొన్నారు. దీంతో పాటు నాల్గు ఎకరాల పొలంలో మినుముపంటను సాగు చేశారు. ఎకరాకు రూ.25వేలు ఖర్చవవుతుందని, క్వింటా ధర రూ.8వేలకు పైగా ఉంటుందని, ఎకరాకు దాదాపుగా 10క్వింటాళ్ల దిగుబడికి ఖర్చులు పోను దాదాపుగా రూ.50వేల వరకు మిగులుతుందన్నారు.





రైతు అచ్యుతారెడ్డి పొలంలో బంతిపూల తోట ..